మనం
కడప | అన్నమయ్య

## దక్షిణ కొరియా గాచోన్ యూనివర్సిటీతో వైవీయూ కీలక అడుగు

5లో



## నూతనంగా ఎన్నికైన స్కూల్ కమిటీ సభ్యులకు యల్లటూరు అభినందనలు




రాజంపేట. అక్టోబర్.3 (మనం న్యూస్) :రాజంపేట మండల పరిధిలోని హస్తవరం చెర్లోపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ వైస్ చైర్మన్‌గా అరవ నారాయణ, కమిటీ సభ్యులుగా పూసల దేవి, మల్లేశ్వరి ఎన్నికైన సందర్భంగా జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ ఇన్‌చార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజును విజయ నరసింహరాజు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యల్లటూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.
అనంతరం నూతన వైస్ చైర్మన్, కమిటీ సభ్యులను యల్లటూరు శ్రీనివాసరాజు శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో రాఘవ జగదీష్ కుమార్‌రాజు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

## చమర్తిని కలిసిన రాజంపేట అర్బన్ సిఐ



రాజంపేట అక్టోబర్ 3(మనం న్యూస్) రాజంపేట టౌన్ (అర్బన్) సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కె. హేమసుందర్ నాయుడు రాజంపేట నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ మరియు ప్రజారక్షణే ధ్యేయంగా పోలీసు శాఖ సేవలు అందించాలని కోరుతూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా మేడా రఘునాథ్‌రెడ్డి



రాజంపేట: అక్టోబర్: 3 (మనం న్యూస్ ) రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి మరోసారి రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.రైల్వే ప్రయాణికుల సమస్యలు, మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త రైల్వే సౌకర్యాల కల్పన, రైల్వే స్టేషన్ల అభివృద్ధి తదితర ప్రజా ప్రయోజన అంశాలను పార్లమెంట్ స్థాయిలో ప్రస్తావించేందుకు ఈ కమిటీ సభ్యత్వం కీలకంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

# బీసీల అభ్యున్నతే టిడిపి లక్ష్యం

**బి.సి" ల 34% రిజర్వేషన్‌కు టిడిపి కట్టుబడి ఉంది - రిజర్వేషన్‌కు అడ్డంకిగా గొడ్డలి పార్టీ**

**అయినా సుప్రీంకోర్టు ద్వారా ముందుకెళతాం..- 34% రిజర్వేషన్ సాధించేవరకు పోరాడుతాం..**

**తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు**







రాజంపేట మనం న్యూస్ అక్టోబర్ 3: బీసీల అభివృద్ధి,అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. శనివారం పార్టీ స్థానిక కార్యాలయం నందు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలను అన్ని రంగాలలోనూ ములుగు తీసుకెళ్లేందుకు ఇప్పటికే తెలుగుదేశం పార్టీ కృషి చేసిందని,ఆ ఫలాలు బీసీలు ప్రస్తుతం అనుభవిస్తున్నారని, సర్పంచులుగా, ఎంపీపీలుగా, మేయర్లుగా అనేక పదవుల్లోనూ, సామాజికంగా,ఆర్థికంగా,రాజకీయంగా తెలుగుదేశం పార్టీ బీసీలకు పెద్దపీట వేసిందని చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు. అదేవిధంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కూడా రాష్ట్ర అధ్యక్షుడు నుండి అనేక కీలకమైన పదవుల్లో బీసీలకు అగ్రస్థానం కల్పించి టిడిపి సముచిత స్థానం ఇచ్చిందన్నారు.
అంతేకాకుండా బీసీల అభ్యున్నతిని గొడ్డలి పార్టీ వైసీపీ అడ్డుకుంటోందని ఆరోపించారు. 34 శాతం రిజర్వేషన్ ను అడ్డుకునేందుకు వైసిపి తమ బినామీ పేర్లతో కోర్టులో కేసులు వేయిస్తోందని, అయినా, తెలుగుదేశం పార్టీ హైకోర్టు ఆదేశాలను గౌరవిస్తూనే సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు. బీసీల హక్కులు సాధించే వరకు తెలుగుదేశం పార్టీ పోరాడుతుందని చమర్తి స్పష్టం చేశారు. గొడ్డలి పార్టీ ఇకనైనా దిగజారుడు రాజకీయాలు,గూండా గిరి, దౌర్జన్యాలు మానుకొని ప్రజా శ్రేయస్కర నిర్ణయాలకు అడ్డుపడకుండా ఉంటే ప్రజలు క్షమిస్తారని,లేదంటే పార్టీని బంగాళాఖాతంలో కలుపుతారని చమర్తి జగన్ మోహన్ రాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంతం శివప్రసాద్,మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సి సుధాకర్, మాజీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తుపాకుల అశోక్,పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కే కరీమ్, రాంనగర్ నరసింహ,ఎన్టీఆర్ కేశవ,పీరు సాహెబ్, రాము యాదవ్,దుర్గం ఆంజనేయులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఎస్పీ

**రేపు ప్రొద్దుటూరుకు రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**





కడప అక్టోబర్ 03 మనం న్యూస్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్టోబర్ 5న ప్రొద్దుటూరు మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసీ డా. నిధీమీనా లతో కలిసి ముఖ్యమంత్రి పర్యటనా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రొద్దుటూరు పట్టణంలోని జమ్మలమడుగు రోడ్డులో జలజీవన్ మిషన్ కు సంబంధించి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు ఇచ్చిన జిల్లా కలెక్టర్ ముందుగా అమృత నగర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ను పరిశీలించి, ఆర్ అండ్ బి, పీఆర్ ఇంజనీర్లకు పలు సూచనలు ఇచ్చి.. నాయకుల లైన్ అప్ కోసం భారీ కేడ్ల ఏర్పాట్లపై సూచనలు ఇచ్చిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి. అనంతరం కొర్రపాడు రోడ్డు సర్కిల్ లో ఏర్పాటు చేసిన జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనుల ఫైలాన్ నిర్మాణ పనులను పరిశీలించి... పలు సూచనలు ఇచ్చిన జిల్లా కలెక్టర్. అనంతరం ప్రొద్దుటూరు బైపాస్ జమ్మలమడుగు మార్గంలోని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి పాల్గొనే ప్రజావేదిక సభ ఏర్పాట్లను పరిశీలించి.. అక్కడ గ్యాలరీలు, సెక్యూరిటీ, నిర్వహణ తదితర అంశాలపై నాయకులు, సంబందిత అధికారులతో చర్చించిన జిల్లా కలెక్టర్ అనంతరం ముఖ్యమంత్రి నిర్వహించే పార్టీ కేడర్ సమావేశం కోసం .. అక్కడ భద్రతా ఏర్పాట్లపై సబ్ కలెక్టర్ హెచ్ ఎస్. భావన, ఏఎస్పీ విభూకృష్ణ, సంబందిత అధికారులకు పలు సూచనలు ఇచ్చిన జిల్లా కలెక్టర్. కార్యక్రమంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై మాట్లాడిన సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి, భూపేష్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో శిరీష, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, తహసీల్దార్ ఉదయ్ భాస్కర్, ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, ఏపీఎస్పీడిసిఎల్, పీఆర్, పోలీస్, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విలువలతో కూడిన నాయకత్వమే బలం

**టీడీపీ నేత డాక్టర్ నవీన్‌కుమార్**
**మొక్కలు నాటిన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి**
**ఘనంగా 'సేవా మేరా యోగ్దాన్'**



మనం ప్రతినిధి రాజంపేట అక్టోబర్ 3, యువత రాజకీయాలపై సమగ్ర అవగాహన పెంచుకొని, నైతిక విలువలతో కూడిన నాయకులుగా ఎదిగినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ నవీన్‌కుమార్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రజాజీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పట్టణంలో 'సేవా మేరా యోగ్దాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రాజంపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు, డాక్టర్ నవీన్‌కుమార్ స్థానికంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చమర్తి జగన్మోహన్‌రాజు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించేలా చొరవ చూపాలని కోరారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, నైపుణ్యాభివృద్ధి పోటీలకు డాక్టర్ నవీన్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తని, స్వచ్ఛమైన, కల్తీలేని రాజకీయ నాయకత్వంతో నవభారత నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని




ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, టీడీపీ, భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయండి

### టిడిపి మండల అధ్యక్షులు



సిద్ధవటం, అక్టోబర్ 3 మనం న్యూస్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కడప జిల్లా పర్యటన సందర్భంగా సభను విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు రాజశేఖర్ తెలిపారు మండల కేంద్రమైన సిద్దోటంలో ఆయన శనివారం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కడప జిల్లా పర్యటనలో భాగంగా ప్రొద్దుటూరుకు 5వ తేదీన జల్ జీవన్ మిషన్ మహా ప్రాజెక్టు బొల్లవరం, జమ్మలమడుగు బైపాస్ రోడ్డు, పొద్దుటూరు పట్టణంలో శంకుస్థాపన చేస్తున్నారని సిద్ధవటం మండలం నుండి రాజంపేట నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో 10 ఆర్టీసీ బస్సులను సమకూరుస్తున్నామని కావున కూటమినేతలు ప్రతి ఒక్కరూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటను విజయవంతం చేయాలన్నారు ఈ కార్యక్రమంలో, మండల టిడిపి అధ్యక్షులు రాజశేఖర్, క్లస్టర్ ఇంచార్జ్ రాజా నాయుడు, పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగ ముని రెడ్డి వెలుగు పల్లి మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు పార్ల రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంతో ఇంటి వద్దకే వైద్య సేవలు



ముద్దనూరు, అక్టోబర్,3,మనం న్యూస్: వైద్యసేవలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో సేవా సంకల్ప అభియాన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ముద్దనూరు, తిమ్మాపురం, కొత్తపల్లిలో గ్రామాలలో సేవాసంకల్ప అభియాన్ ఉచిత వైద్య శిబిరాన్ని వైద్యాధికారులు డా. కరిష్మా,శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు పేర్కొన్నారు. సుమారు 120 మందికి ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించగా, 33 మంది గర్భిణులకు ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన డా. తేజ ఆధ్వర్యంలో స్కానింగ్ పరీక్షలు నిర్వహించి గర్భిణీలకు తగు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యురాలు సూర్యకుమారి హెల్త్ అధికారి ప్రసాద్ యాదవ్, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం షాపుల దరఖాస్తు గడువు పెంపు

### ఎక్సైజ్ సీఐ రాజశేఖర్




సిద్దవటం అక్టోబర్ 3(మనం న్యూస్): మద్యం దుకాణాల కొరకు దరఖాస్తు గడువు పెంచినట్లు ఎక్సైజ్ సిఐ రాజశేఖర్ తెలిపారు మండల కేంద్రమైన సిద్ధవటం లోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లో శనివారం ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ పరిధిలోని నూతన మద్యం షాపుల దరఖాస్తు గడువు ఈనెల 6 వరకు పెంచామని తెలిపారు, ఎక్సైజ్ పరిధిలోని మాచుపల్లి, భాకరాపేట, ఒంటిమిట్ట మాధవరం గ్రామాల్లో 5 మద్యం దుకాణాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 6 వరకు గడువు పెంచిందన్నారు. దరఖాస్తుదారులకు ఏదైనా సమస్య ఉంటే పోలీస్ స్టేషన్లో వచ్చి కలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నారాయణ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు

## షటిల్ క్రీడా పోటిల్లో నల్లపురెడ్డిపల్లి స్కూల్ విద్యార్థి జిల్లా స్థాయికి ఎంపిక



పెనగలూరు(అక్టోబర్03),మనంన్యూస్: షటిల్ క్రీడా పోటిల్లో పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి మహీధర్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కృష్ణ మూర్తి, పీడీ హరినాథ్ తెలిపారు. శనివారం రాజంపేట ఉన్నత పాఠశాలలో జరిగిన డివిజనల్ స్థాయి పోటీలలో మహీధర్ అద్భుత ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి కి ఎంపిక అయిన విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు, పీడీ, ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

## రిటైర్డ్ డివిజనల్ పీఆర్ఓ మస్తాన్ సాహెబ్ కన్నుమూత

### సమాచార పౌర సంబంధాల శాఖ సంతాపం



మనం న్యూస్ కడప అక్టోబర్ 3: సమాచార పౌర సంబంధాల శాఖ విశ్రాంత డివిజనల్ పీఆర్ఓ మస్తాన్ సాహెబ్ అనారోగ్యంతో శనివారం తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన శనివారం మరణించినట్లు కుటుంబ సభ్యులు, అధికారులు తెలిపారు. మస్తాన్ సాహెబ్ ఆకస్మిక మృతి పట్ల జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు. పౌర సంబంధాల శాఖ అధికారులు వెంకటేశ్వర ప్రసాద్, సహాయ సంచాలకులు రమేష్‌తో పాటు కార్యాలయ ఉద్యోగులు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఆయన కనబరిచిన నిబద్ధతను, అందించిన విశేష సేవలను అధికారులు కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# మహిళ ఫోన్ కాల్‌తో వేసిన పక్కా స్కెచ్ రెండేళ్ల పగ తీర్చుకునేందుకు దారుణం

### చిట్వేల్‌లో కారు డ్రైవర్‌పై దాడి కేసును ఛేదించిన పోలీసులు, ఆరుగురు కటకటాల్లోకి...







రైల్వేకోడూరు, అక్టోబర్ 03, మనం న్యూస్ : పాత కక్షలను మనసులో ఉంచుకుని పథకం ప్రకారం కారు డ్రైవర్‌ను పిలిపించి, తీవ్రంగా కొట్టి పరారైన ఘటనలో ఆరుగురు నిందితులను చిట్వేల్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను రేణిగుంట సబ్ డివిజన్ డిఎస్పి వై శ్రీనివాసరావు రైల్వే కోడూరు రూరల్ కార్యాలయంలో శనివారం పాత్రికేయుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించడం జరిగింది. డి.ఎస్.పి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ చిట్వేల్ మండలం మాలే మారుపురం అరుంధతివాడకు చెందిన మంద శ్రీహరి కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. సెప్టెంబర్ 26వ తేదీ రాత్రి 10:00 గంటల సమయంలో ఒక అజ్ఞాత మహిళ అతనికి ఫోన్ చేసి, చెన్నై ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లాలని కారు బుక్ చేసుకుంది. దీనితో శ్రీహరి తన కారుతో కేకే వడ్డిపల్లె వద్దకు చేరుకున్నాడు. అక్కడ నిరీక్షిస్తున్న ఒక మహిళ, ఒక పురుషుడు కారు ఎక్కారు. అనంతరం మిట్టపల్లె హరిజనవాడ క్రాస్ రోడ్డు వద్దకు చేరుకోగానే మరో ముగ్గురు వ్యక్తులు కారులోకి ఎక్కారు. అక్కడి నుంచి కారును చిట్వేల్ - పుల్లంపేట మార్గంలోని వినాయకుని గుడి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ శ్రీహరి చేతులు, కాళ్లు తాడుతో కట్టేసి కర్రలతో దారుణంగా కొట్టారు. అనంతరం బాధితుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్లను లాక్కుని అక్కడ నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెలుగుచూశాయి. సుమారు రెండేళ్ల క్రితం బాధితుడు శ్రీహరి మరియు పెంచలయ్యల మధ్య ఉమాదేవి అనే మహిళ విషయమై గొడవ జరిగింది.

ఆ సమయంలో శ్రీహరి తన స్నేహితులతో కలిసి పెంచలయ్యపై దాడి చేయడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ పగను మనసులో ఉంచుకున్న పెంచలయ్య, శ్రీహరిపై ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకోవడం జరిగిందని,తన పిన్ని కుమారుడైన హరిబాబు మరియు వారి స్నేహితులతో కలిసి పక్కా వ్యూహం పన్నాడు. పథకంలో భాగంగానే ఓ మహిళతో శ్రీహరికి ఫోన్ చేయించి, కారు బుకింగ్ నెపంతో పిలిపించి ఈ దాడికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది అన్నారు. అంతేకాకుండా రేణిగుంట సబ్ డివిజన్ డీఎస్పీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో, రైల్వే కోడూరు సీఐ డి. శ్రీనివాసులు, చిట్వేల్ ఎస్సై ఎస్. వినోద్ కుమార్ మరియు పోలీసు సిబ్బంది సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించారు. అక్టోబర్ 3, 2026న ఉదయం 11:30 గంటల ప్రాంతంలో తిమ్మయ్యగారిపల్లె మూసివేసిన హైస్కూల్ వద్ద ఉన్న క్రింది ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పెంచలయ్య అలియాస్ చిన్నా (37), హరిబాబు (27),,మహేష్ (34), నాగార్జున (26),లక్ష్మయ్య (23),నిర్మల (32). నిందితుల వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన 1 మోటార్ సైకిల్, 3 సెల్‌ఫోన్లు, 3 కర్రలు మరియు 1 ఇనుప రాడ్ ను స్వాధీనం చేసుకున్నామని, నిందితులను న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నామని పోలీసులు తెలిపారు. సమర్థవంతంగా కేసు దర్యాప్తు చేపట్టి నిందితులను వేగంగా అరెస్ట్ చేసిన రైల్వే కోడూరు రూరల్ సీఐ, చిట్వేల్ ఎస్సై మరియు పోలీసు సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కేసును చేదించిన చిట్వేల్ ఎస్సై వినోద్ కుమార్ మరియు పి సి లు శ్రీహరి, బ్రహ్మానందరెడ్డి, నరేంద్ర, రామక్రిష్ణ, విజయ్ కుమార్ రెడ్డి,శివయ్య, మహిళా కానిస్టేబుల్ రాధిక లకు డిఎస్పి నగదు బహుమతి అందజేసి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# శ్రీసిటీ బాయిలర్ పేలుడు ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి

### మృతుల కుటుంబాలకు రూ.కోటి, క్షతగాత్రులకు రూ.25లక్షల పరిహారం చెల్లించాలి: సీఐటీయూ డిమాండ్

రైల్వే కోడూరు, అక్టోబర్ 03, మనం న్యూస్ : తిరుపతి జిల్లా సత్యవేడు ప్రాంతంలోని శ్రీసిటీ 'టాబ్లెట్స్ ఇండియా లిమిటెడ్' పరిశ్రమలో చోటుచేసుకున్న భయానక బాయిలర్ పేలుడు ఘటనపై ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని, ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం రైల్వే కోడూరులోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ నాయకులు సి.హెచ్. చంద్రశేఖర్ ఆర్. వెంకటేష్ మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పరిశ్రమలో బాయిలర్ పేలుడు దాటికి తీవ్రంగా గాయపడి కార్మికులు ప్రాణాలు కోల్పోవడం, పలువురు తీవ్ర క్షతగాత్రులుగా మారడం అత్యంత విషాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ప్రాణాలకు తగిన రక్షణ కల్పించడంలో యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం వహించిందని, పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం కూడా తన బాధ్యతలను విస్మరించడం వల్లే ఇటువంటి ప్రమాదాలు పునరావృతమవుతున్నాయని మండిపడ్డారు. పరిశ్రమల్లో




ఉత్పత్తి, లాభాలకు ఇచ్చే ప్రాధాన్యతను కార్మికుల ప్రాణాలకు ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. భద్రతా ప్రమాణాలను గాలికొదిలేసి కార్మికులతో పనులు చేయిస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడటం దారుణమని విమర్శించారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ. 50 లక్షల పరిహారం ఎంతమాత్రమూ సరిపోదని, బాధిత కుటుంబాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రతి కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రతి క్షతగాత్రుడికి రూ. 25 లక్షల పరిహారంతో పాటు మెరుగైన వైద్య సేవలను పూర్తి ఉచితంగా అందించాలని కోరారు. మృతి చెందిన కార్మికుల కుటుంబంలో అర్హులైన ఒకరికి తక్షణమే ఉద్యోగం కల్పించాలని, వారి పిల్లల చదువు, కుటుంబాల భవిష్యత్తుకు ప్రభుత్వం మరియు పరిశ్రమ యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం కేవలం కొంత పరిహారం ప్రకటించి చేతులు దులుపుకోకుండా బాధిత కుటుంబాలకు సుదీర్ఘకాలం పాటు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.

బాయిలర్ పేలుడుకు అసలు కారణాలు ఏమిటి, నిర్దేశిత భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా, అలాగే నిర్వహణలో ఏమైనా లోపాలు జరిగాయా అనే కోణాల్లో నిష్పక్షపాత విచారణ జరిపించాలని కోరారు. ఈ ఘటనకు బాధ్యులైన యాజమాన్యం మరియు అధికారులపై కేసులు నమోదు చేసి చట్టపరంగా తీవ్రంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ప్రభుత్వం పునరాలోచించి రాష్ట్రంలోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై తక్షణమే సమగ్ర తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయూ కోడూరు మండల కన్వీనర్ పి. జాన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోనైనా కష్టపడితే ఫలితం ఉంటుందని నిరూపించిన గణిత శాస్త్రవేత్త ఆచార్య చక్రవర్తుల శివకృష్ణంరాజు





చిట్వేలీ అక్టోబర్ 3 మనం న్యూస్: సాధనతో ప్రతి విద్యార్థి బంగారు భవిష్యత్తు సాధించుకోవచ్చని డాక్టర్ ఆచార్య శివకృష్ణ రాజు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చిట్వేలి శాఖ ఆధ్వర్యంలో చిట్వేలి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఏం.రాచపల్లికి చెందిన శివకృష్ణంరాజు గణిత శాస్త్రంలో రెండు పీహెచ్డీల పట్టాలు అలాగే ప్రతిష్టాత్మకమైన స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ ప్రపంచ అగ్రశ్రేణి గణిత శాస్త్రవేత్తల జాబితాలో వరుసగా నాలుగుసార్లు దక్షిణ కొరియా హైన యంగ్ యూనివర్సిటీలో విజిట్ ప్రొఫెసర్ గా పనిచేశారు. శనివారం నాడు వారి స్వగ్రామం ఎం.రాచపల్లికి వచ్చిన సందర్భంగా మానవతా సంస్థ ఆధ్వర్యంలో శివకృష్ణంరాజు ను శాలువాతో సత్కరించి మెమెంటో ను అందజేశారు. అనంతరం పాఠశాల పూర్వ విద్యార్థి కావడంతో ఉపాధ్యాయులు యాజమాన్యం, చిట్వేలి మాజీ ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి, తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిలు శివకృష్ణమరాజును ఘనంగా సత్కరించి జ్ఞాపకను అందజేశారు. తదుపరి విద్యార్థులకు ఎదుగుదలకు కావలసిన ప్రోత్సాహక సందేశాలను సభ్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బి.శ్రీనివాసలు, గౌరవ ఆత్మీయ సహకారం అధ్యక్షులు ఉమామహేశ్వర్ రెడ్డి, గౌరవ డైరెక్టర్ సభ్యులు తిరుమల విశ్వనాథం, తురక రంగారెడ్డి, కో చైర్మన్ మునిరావు, కన్వీనర్ కే.సాయిరాం, గౌరవ సభ్యులు నరసరామయ్య, కావేరి చంద్ర, పాఠశాల చైర్మన్ శివ ప్రసాద్ గౌడ్, సభ్యులు పంది కాళ్ల మనీ, ఓబిలి పెంచలయ్య, యానాది రాజు, మానవత సభ్యులు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, ఎం.రాచపల్లి యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించండి

## రైల్వే ఏడీఆర్ఎం శివప్రసాద్‌కు జనసేన నాయకుల వినతి – ఆధ్యాత్మిక క్షేత్రానికి పెరిగిన రద్దీని గుర్తించాలని విజ్ఞప్తి





మనం ప్రతినిధి రాజంపేట, అక్టోబర్ 3: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఒంటిమిట్ట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రాకపోకలకు అనుగుణంగా ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ (స్టాపింగ్) కల్పించాలని రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. గుంతకల్ డివిజన్ అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ (ఏడీఆర్ఎం) శివప్రసాద్ శనివారం ఏకశిలా నగరమైన ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనానంతరం జనసేన నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

**ఆధ్యాత్మిక ప్రాధాన్యతను గుర్తించాలి:**

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వైఎస్సార్ జిల్లాలో ఒంటిమిట్ట చారిత్రక, ఆధ్యాత్మిక, పర్యాటక రంగాల్లో విశేష గుర్తింపు పొందిందని తెలిపారు. ఏకశిలా రూపంలో కొలువైన శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు, శ్రీరామనవమి సీతారాముల కల్యాణ మహోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారని పేర్కొన్నారు. నిత్యం భక్తులు, విద్యార్థులు, ఉద్యోగులు, స్థానిక ప్రజల రాకపోకలతో ఒంటిమిట్ట రైల్వేస్టేషన్ రద్దీగా ఉంటుందని గుర్తుచేశారు.

**హాల్ట్ లేక ప్రయాణికుల ఇబ్బందులు:**

ప్రస్తుతం ఒంటిమిట్ట స్టేషన్‌లో పలు ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ లేకపోవడం వల్ల దూరప్రాంతాలకు వెళ్లే భక్తులు, స్థానిక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని నాయకులు ఏడీఆర్ఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రయాణికుల రద్దీ, క్షేత్ర ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకుని మరిన్ని ప్రధాన రైళ్లకు తక్షణమే హాల్ట్ మంజూరు చేయాలని కోరారు. ?ఈ కార్యక్రమంలో నందలూరు రైల్వే ఇన్‌స్పెక్టర్ పెంచలయ్య, ఉమ్మడి కడప జిల్లా జనసేన పార్టీ ప్రోగ్రాం కమిటీ సభ్యులు గురివిగారి వాసు, రాజంపేట యువ నాయకులు కొరముట్ల హరి, నందలూరుకు చెందిన తోట కేదార్‌నాథ్ బాబు, ఒంటిమిట్ట మండల నాయకులు మల్లేశ్వర రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణ కొరియా గాచోన్ యూనివర్సిటీతో వైవీయూ కీలక అడుగు



## సంయుక్త పరిశోధనలు, అధ్యాపక-విద్యార్థుల మార్పిడికి చర్చలు

కడప అక్టోబర్ 3(మనం న్యూస్) : అంతర్జాతీయ పరిశోధనా రంగంలో తన పరిధిని మరింత విస్తరించే దిశగా యోగి వేమన విశ్వవిద్యాలయం కీలక ముందడుగు వేసింది. దక్షిణ కొరియాలోని ప్రతిష్ఠాత్మక గాచోన్ యూనివర్సిటీతో సంయుక్త పరిశోధనలు, పరిశోధకులు-విద్యార్థుల మార్పిడి, అంతర్జాతీయ పరిశోధనా నెట్‌వర్క్ ఏర్పాటుపై చర్చలు ప్రారంభమ య్యాయి. వైవీయూ అంతర్జాతీయ వ్యవహారాల విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ పి. వాసు గోవర్ధనరెడ్డి సమన్వయంతో ఈ చర్చలు కొనసాగుతున్నాయి. ప్రయత్నాలలో భాగంగా, ప్రస్తుతం దక్షిణ కొరియాలోని కొంకుక్ విశ్వవిద్యాలయంలో ఆహ్వానిత బ్రెయిన్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న యోగి వేమన విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ ఎం.వి. శంకర్ అక్టోబర్ 2వ తేదీ న గాచోన్ యూనివర్సిటీలోని ఐ-ఎం.ఇ.ఎం.ఎస్ పరిశోధనా ప్రయోగశాలను సందర్శించి శాస్త్రీయ ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా గాచోన్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, డాక్టరల్ పరిశోధకులు, పీజీ విద్యార్థులతో పరిశోధనా అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఎలక్ట్రోకెమికల్ సింథసిస్, రామన్ స్పెక్ట్రోస్కోపీ, హెచ్ఈఆర్/ఓఈఆర్ విశ్లేషణ, బయోసెన్సర్ సాంకేతికతలు తదితర అధునాతన పరిశోధనా రంగాల్లో గాచోన్ యూనివర్సిటీ ప్రయోగశాలల సౌకర్యాలను పరిశీలించారు. అలాగే డి.ఎఫ్.టి మోడలింగ్, ఫోటోక్యాటలిటిక్ హైడ్రోజన్ ఉత్పత్తిపై సంయుక్త పరిశోధనకు ఉన్న అవకాశాలపైనా చర్చించారు. వైవీయూ-గాచోన్ యూనివర్సిటీల మధ్య మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంవోయూ) కుదుర్చుకుని అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థుల పరస్పర మార్పిడి, సంయుక్త పరిశోధనా ప్రాజెక్టులు చేపట్టే అంశాన్ని పరిశీలిస్తున్నారు. గాచోన్ యూనివర్సిటీ పరిశోధకుడు డా. వై. చంద్రశేఖర్‌ను వైవీయూకు కొంతకాలం పరిశోధనా సందర్శనకు ఆహ్వానించే అంశంపైనా చర్చలు జరిగాయి. ఈ సహకారం ద్వారా వైవీయూ పరిశోధకులకు అంతర్జాతీయ స్థాయి పరిశోధనా సౌకర్యాలు, నిపుణులతో శాస్త్రీయ పరస్పర చర్యలు, సంయుక్త ప్రచురణలు, అంతర్జాతీయ పరిశోధనా నెట్‌వర్క్‌లలో భాగస్వామ్యానికి అవకాశాలు ఏర్పడనున్నాయి. అంతర్జాతీయ విద్యా సంబంధాలను ప్రోత్సహించడంలో ప్రోత్సాహం, మద్దతు అందించినందుకు యోగి వేమన విశ్వవిద్యాలయం గౌరవ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ బి. రాజశేఖర్ కి, వై.వి.యు. అంతర్జాతీయ వ్యవహారాల కార్యాలయ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. వాసు గోవర్ధన రెడ్డి కి ప్రొఫెసర్ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, రెక్టార్ ప్రొఫెసర్ ఎ. జి. దాము, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. సి. గంగిరెడ్డి, వై.వి.యు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్, మెటీరియల్స్ సైన్స్ అండ్ నానోటెక్నాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్. రామమనోహర్ రెడ్డి, రసాయన శాస్త్ర విభాగాధిపతి మార్గదర్శకత్వం, సహకారం అందించినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# వివిధ పోటీలలో సత్తా చాటి రాష్ట్ర, జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులు

చిట్వేలి అక్టోబర్ 3 మనం మనం న్యూస్:

సేవా సంకల్ప అభియాన్ జిల్లా స్థాయి పోటీలలో చిట్వేలి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజు దుర్గరాజు తెలియజేశారు. తిరుపతి తిరుచానూరు ఉన్నత పాఠశాల నందు శనివారం జరిగిన జిల్లాస్థాయి వక్తృత్వపు పోటీలలో పాఠశాలలో 7వ.తరగతి చదువుతున్న బేబీ హబ్బా జాన్ జూనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో, అలాగే చిత్రలేఖన పోటీలలో ముద్దిన జగదీష్ ఎనిమిదో తరగతి విద్యార్థి మూడో స్థానంలో నిలిచి ఈనెల తొమ్మిదవ తేదీన జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

విద్యార్థులకు శిక్షణ ఇచ్చి రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యేలా చేసిన ఉపాధ్యాయులు సోఫియా సుహాసిని, ప్రవీణ్ కుమార్, అనూషలను ప్రధానోపాధ్యాయులు మరియు పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ శివ ప్రసాద్ గౌడ్ అభినందించారు. క్రీడా పోటీల యందు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం రాజంపేట గవర్నమెంట్ హైస్కూల్ నందు జరిగిన డివిజనల్ స్థాయి బ్యాడ్మింటన్ అండర్-14 బాలుర విభాగంలో ఎనిమిదో తరగతి చదువుతున్న రెడ్డయ్య మరియు సాయికుమార్ విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు తెలిపారు. విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపికయ్యేలా బ్యాడ్మింటన్ నందు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఈశ్వర్ రాజు మరియు నాగలక్ష్మి లను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ శివ ప్రసాద్ గౌడ్ అభినందించారు.

# అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

## 6 మద్యం బాటిల్స్ స్వాధీనం –ఎక్సైజ్ సీఐ రాజశేఖర్



సిద్దవటం అక్టోబర్ 3(మనం న్యూస్) : అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని 6 మద్యం బాటిల్స్ స్వాధీనపరచుకొని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ తెలిపారు మండల కేంద్రమైన సిద్దవటంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో ఆయన శనివారం మాట్లాడుతూ గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం కల్ప చెన్నై జాతీయ రహదారి శివుని పల్లి సమీపాన కడప ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది, స్థానిక ఎక్సైజ్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు చేపట్టగా నరసయ్య అనే వ్యక్తి అక్రమ మద్యం విక్రయిస్తుండగా అతని వద్ద నుండి 6 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని అక్రమ మద్యం అమ్మకాలు చేపడితే కఠినమైన చర్యలు తప్పవని ఎక్సైజ్ రాజశేఖర్ హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

# మద్యం షాపుల దరఖాస్తు గడువు పొడిగింపు

## జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారి మధుసూదన్ వెల్లడి

రైల్వేకోడూరు, అక్టోబర్ 03, మనం న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు ఎక్సైజ్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, కోడూరు ప్రొహిబిషన్,ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఉన్న 17 మద్యం షాపులకు లాటరీ పద్ధతిలో లైసెన్సుదారులను ఎంపిక చేసేందుకు దరఖాస్తుల గడువును పొడిగించడం జరిగిందని, ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబర్ 6, 2026 రాత్రి 12.00 గంటల వరకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా తమ దరఖాస్తు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని జిల్లా ప్రొహిబిషన్,ఎక్సైజ్ అధికారి మధుసూదన్ తెలియజేశారు. ఈ ప్రక్రియకు సంబంధించిన తదుపరి షెడ్యూల్‌ను కూడా అధికారులు వెల్లడించారు. సమర్పించిన దరఖాస్తుల పరిశీలన మరియు లాటరీ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు అక్టోబర్ 7న పూర్తి చేస్తారు. అనంతరం అక్టోబర్ 8న ఉదయం 8.00 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ప్రక్రియను చేపట్టి, ఎంపికైన విజేతల వివరాల సమాచారాన్ని తెలియజేస్తారని వెల్లడించారు. రాజంపేట మున్సిపాలిటీ పరిధిలోని 4 షాపులకు, కోడూరులోని 6షాపులకు మరియు ఓబుల వారిపల్లిలోని ఒక షాపునకు 2026-27 సంవత్సరానికి గానూ లైసెన్స్ ఫీజు రూ. 71,50,000 కాగా, పర్మిట్ రూమ్ లైసెన్స్ ఫీజు రూ. 7,50,000 గా నిర్ణయించారు. అలాగే రాజంపేట రూరల్, పెనగలూరు, పుల్లంపేట, చిట్వేలు మండలాల్లో ఒక్కొక్క షాపు చొప్పున మరియు నందలూరులోని 2 షాపులకు లైసెన్స్ ఫీజు రూ. 60,50,000, పర్మిట్ రూమ్ ఫీజు రూ. 5,00,000 గా నిర్దేశించారు. దరఖాస్తుదారులు స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌ను కానీ లేదా మదనపల్లెలోని డి-మార్ట్ సమీపంలో ఉన్న జిల్లా ప్రొహిబిషన్,ఎక్సైజ్ కార్యాలయాన్ని కానీ సంప్రదించవచ్చు. లైసెన్సులు లేదా ఇతర సమాచారం కోసం దరఖాస్తుదారులు జిల్లా అధికారి ఫోన్ నంబర్ 7981216391 ద్వారా నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు.

# వన్యప్రాణులపై విద్యార్థులకు అవగాహన

## సిద్ధవటం ఫారెస్ట్ రేంజర్




సిద్ధవటం, అక్టోబర్ 3 మనం న్యూస్ : కడప డిఎఫ్ఓ రాజశేఖర్ ఆదేశాల ప్రకారం విద్యార్థినీ విద్యార్థులకు వన్నె ప్రాణులపై అవగాహన కార్యక్రమం నిర్వహించామని సిద్ధవటం ఇంచార్జ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నయీం అలీ తెలిపారు మండల కేంద్రమైన సిద్ధవటం లోని నలంద స్కూల్లో శనివారం కడప డీఎఫ్ఓ రాజశేఖర్ ఆదేశాలతో వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు వన్యప్రాణులపై అవగాహన నిర్వహించామని సిద్దవటం ఇంచార్జ్ ఫారెస్ట్ రేంజర్ నయీశీ ఆలీ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2 నుండి, 8 తేదీ వరకు అటవీ ప్రాంతంలో ఉన్న వన్యప్రాణులపై అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని వన్యప్రాణుల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తెలిపామని అడవుల ప్రయోజనాలు వ్యాసరచన పోటీలు నిర్వహించామని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారన్నారు అటవీ ప్రాంతాన్ని పచ్చదనంతో ఉండేటట్లు విద్యార్థులు ప్రతి ఒక్కరూ మీ ప్రాంతాలలో తెలపాలని వన్యప్రాణులు దాహం కోసం గ్రామాల్లో కొస్తే ఇటువంటి ప్రాణహానికి ఎటువంటి ప్రాణహాని తలపెట్టకుండా ఫారెస్ట్ అధికారులకు తెలపాలని సూచించారు అటవీ సంపద కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు పచ్చని చెట్లు పెంచి పచ్చదనాన్ని పెంచాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు ఈ కార్యక్ర మంలో డిప్యూటీ డేంజర్, ముక్తార్ భాష, నలంద పాఠశాల కరస్పాండెంట్ వెంకటసుబ్బయ్య, అటవీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థిని భవిష్యత్తుకు కొండంత అండ

## ప్రతి నెలా 1వ తేదీన 5,000 ఆర్థిక సాయం ప్రకటించిన ధ్వజారెడ్డి



రైల్వే కోడూరు, అక్టోబర్ 03, మనం న్యూస్ : పేదరికంలో ఉన్నప్పటికీ ఉన్నత చదువులు చదువుతున్న బీటెక్ విద్యార్థినికి ఆర్థికంగా అండగా నిలిచేందుకు స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, మండల మాజీ ఉపాధ్యక్షులు రామిరెడ్డి ధ్వజారెడ్డి ముందుకొచ్చారు. రైల్వే కోడూరు పట్టణంలోని న్యూ కృష్ణానగర్‌కు చెందిన సురేష్ కుమార్తె బీటెక్ అభ్యసిస్తోంది. ఆమె హాస్టల్ ఫీజు నిమిత్తం ప్రతి నెల 1వ తేదీన రూ.5,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తానని ధ్వజారెడ్డి ప్రకటించారు. విద్యార్థిని చదువుకు ఎటువంటి అడ్డంకులు కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ సహాయాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచులు తోట శివసాయి, కొరెడ్డి సిద్దయ్య యాదవ్, మాజీ సర్పంచులు హరికృష్ణా రెడ్డి, గోపి, చంద్రశేఖర్, ఆర్.వి. రమణ, రమణయ్య, చెంగల్ రెడ్డి; మాజీ ఎంపీటీసీలు ఆనంద్ యాదవ్, లత, కృష్ణారెడ్డి, రమణారెడ్డి, రెడ్డయ్య రెడ్డి, మణి, జహంగీర్, భాషా, కుంచం హరి, నాగరాజుతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పి.జి.ఆర్.ఎస్. అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలి

## జిల్లా రెవెన్యూ అధికారి, పి.జి.ఆర్.ఎస్. నోడల్ అధికారి విజయకుమార్



నెల్లూరు (మనం న్యూస్) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) ద్వారా అందిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులపై ఉందని జిల్లా రెవెన్యూ అధికారి, పి.జి.ఆర్.ఎస్. నోడల్ అధికారి విజయకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు తమ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న అర్జీలతో పాటు, నేరుగా అందిన అర్జీలను కూడా ప్రతిరోజూ పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు పారదర్శకంగా పరిష్కరించడంతో పాటు, అర్జీదారు లకు సంతృప్తికరమైన పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పి.జి.ఆర్. ఎస్. అర్జీల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా అర్జీలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణీత గడువులోగా పారదర్శకంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని డిఆర్వో ఆ ప్రకటనలో తెలిపారు.